# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**MARCH-2015**

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్తవార్తలు

2015 ఫిబ్రవరి 7,8,9 తేదీలలో సికింద్రాబాదు యాప్రాల్‌లో యున్న క్రీస్తు సంఘము మూడు రోజుల బైబిలు తరగతులు నిర్వహించిరి. యాప్రాల్ చుట్టుయున్న అనేకప్రాంతముల నుండి విశ్వాసులు హాజరై దేవుని వాక్య పఠనములో సంతోషముగా పాల్గొనిరి. అమెరికా నుండి వచ్చిన సోదరులు మార్క్ రేనాల్డ్ గారు, గేరీ రేనాల్డ్ గారు, నార్మన్ రైట్ గారు మరియు మైక్‌గోర్‌గారు వాక్యపరిచర్యచేసిరి. సోదరులు రిక్కీ గూటం, రోనీగూటం గార్లు తర్జుమా చేయుటలో సహకరించిరి. లెమూయేల్ ఆచారియ గారు కుటుంబసమేతముగా ఎంతో శ్రమించి ఈ క్లాసులు విజయవంతము చేసిరి. ఆఖరిదినమున 9 మంది స్త్రీ, పురుషులు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి. ఈ రీతిగా యాప్రాల్‌లోని క్రీస్తు సంఘము దిన దినాభివృద్ధి జెందుచున్నది.

2015 ఫిబ్రవరి 9వ తేదీ రాత్రికి రోనీగూటం గారు సతీసమేతముగా అమెరికా పయనమైరి. 10వ తేదీ రాత్రికి కేలిఫోర్నియాకు క్షేమముగా చేరుకొనిరి.

2015 ఫిబ్రవరి 10వ తేదీ ఉదయం నిజామాబాద్‌జిల్లా కామారెడ్డిలో జరిగిన కూటములో పై సోదరులు వాక్యపరిచర్య చేసిరి. రిక్కీగూటంగారు ఆ కూటమునకు సారధ్యము వహించిరి. తదుపరి వారు బయలు దేరి నిజామాబాద్ జిల్లా దగ్గిలో జరిగిన కూటములో పాల్గొనిరి. దగ్గిలో సోదరులు దేవిడ్ కుమార్‌గారు క్రీస్తు సువార్త చాటుచున్నారు. అక్కడ ఐదుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. తదుపరి అమెరికా సోదరులు, రిక్కీగారు, బంగారు బాబుగారు బయలు దేరి బోధన్ చేరుకొని రాత్రి అక్కడ బసచేసిరి.

2015 ఫిబ్రవరి 11వ తేదీ బుధవారం మధ్యాహ్నం బోధన్‌లో సోదరుడు మోహనాచారి యింటివద్ద సువార్త కూటము జరిగెను. ఆప్రాంతములో యున్న పలువురు క్రీస్తు సంఘబోధకులు హాజరైరి. పైనుదహరించిన అమెరికా బృందము వాక్యోపదేశము చేయగా రిక్కీగారు తెలుగునకనువదించిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి.

బోధన్ పట్టణమునుండి సోదరులు కరీంనగర్ జిల్లాలో ప్రవేశించి యెనుగుల గ్రామములో యున్న క్రీస్తు సంఘమును దర్శించి వాక్యపరిచర్య చేయగా 8 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. యెనుగులలోని సహోదరులు తమ స్వయం కృషి వలన ఒక ఆలయమును నిర్మించుచున్నారు. ఆగ్రామములో పలుసంవత్సరములుగా పసుల దానియేలు గారు సువార్త చాటుచున్నారు.

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001
Ph : 0884 - 2363722
Mobile : 9848998547
Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 35 | మార్చి - 2015 | సంచిక - 8

## క్రీస్తుని గూర్చి మీకేమి తోచుచున్నది
## ( What Think Ye of Christ ?)

యేసుక్రీస్తు ఈ లోకమందు ఉద్భవించినది మొదలుకొని ఆయన యెవరు ? అనే ప్రశ్నను ప్రతివారు ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. ఈలోక మందు సంచరించిన అనేక మతగురు వులవలె గాక యేసుయొక్క నామము ప్రతివానిలోను వివిధ భావములను రేకెత్తించుచున్నది. ఇది చాల ప్రాముఖ్య మైన ప్రశ్న. విశ్వాసమునకది మూలరాయి వంటిది (యెష 28:16). మానవుడు క్రీస్తుని గూర్చి ఏమి తలంచుచున్నాడో దానిని బట్టి అతని ఆత్మయొక్క గమ్యస్థితి యుండును. అందుకే 'నేను ఆయనని (అనగా దేవుని కుమారుడనని) మీరు విశ్వసించనియెడల మీరు మీ పాపముల లోనే యుండి చనిపోవుదురని' యేసు చెప్పెను (యోహాను 8:24).

"ఒకప్పుడు పరిసయ్యులు కూడియుండగా యేసు వారిని చూచి క్రీస్తుని గూర్చి మీకేమి తోచుచున్నది. ఆయన ఎవని కుమారుడని అడిగెను. వారు–ఆయన దావీదు కుమారుడని చెప్పిరి" (మత్తయి 22:41,42). శరీరమును బట్టి యేసుక్రీస్తు దావీదు

కుమారుడయ్యెను (రోమా 1:7). ఆయన తల్లియైన మరియ మనుష్య మాత్రురాలు గనుక ఆయన మనుష్యకుమారుడాయెను. క్రీస్తు శరీరధారియై మనమధ్య నివసించెను (యోహాను 1:14). ఆయన దైవ మానవత్వములను కలిగి యుండుటవలన మానవుల రక్షకునిగాను, దేవుని సన్నిధానమున వారికి మధ్యవర్తిగాను ఉండుట కవకాశవమేర్పడెను (1 తిమో 2:5, 6). మనుష్యకుమారునివలె క్రీస్తు శోధించబడెను. ఆకలి దప్పికలనను భవించెను. శ్రమలను, బాధలను భరించెను. మానవులందరివలె ప్రార్థనావశ్య కతను కలిగి యుండెను. అయితే ఆయన కేవలము మానవమాత్రుడు కాడు.

యేసుక్రీస్తు దేవుని అద్వితీయ కుమారుడై యుండెను. యేసు దావీదు కుమారుడని పరిసయ్యులు చెప్పినది సత్యమేగాని, అది పరిపూర్ణ సత్యము కాదు. క్రీస్తు కేవలము మానవుడే అయితే దావీదు ఆయనను ప్రభువని ఏల సంబోధించెనని యేసు వారినడిగెను. క్రీస్తు దావీదుకు ముందునుండియే యుండెను. నిజానికి ఆయన లేని సమయమంటు ఎన్నడు లేనే లేదు (యోహాను 1:1, 8:58). ఆయన అల్ఫాయును ఓమెగయును ఆదియును అంతమునైయున్నాడు (ప్రకటన 1:8). కాలారంభము కాకముందు నుండియే క్రీస్తుఉండెను. కాలాంతమయి పోయినను కూడ ఆయన ఉండును.

క్రీస్తు దేవుని యొక్క ఏకైక కుమారుడు. పరిశుద్ధాత్ముని శక్తివలన ఆయన ఒక కన్యకు జన్మించెను. ఆయన తండ్రి దేవుడు గనుక ఆయన దైవత్వము కలిగి దేవుని కుమారుడైయుండెను. ఆయన ఇమ్మానుయేలని పిలువబడెను. ఇమ్మానుయేలనగా దేవుడు మనకు తోడని యర్థము (మత్తయి 1:23).

**ఆయన శరీరధారియైన దేవుడు :**

"నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మవిషయమున నీతిపరుడని తీర్పునొందెను. దేవదూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను" (1 తిమో 3:16). అందువలననే యేసు "నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడని" చెప్పగలిగెను (యోహాను 14:9). ఆయన దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండెను (హెబ్రీ 1:3).

యేసు దేవుని కుమారుడని సాక్ష్యము పొందెను. యేసు యొర్దాను నదిలో యోహాను చేత బాప్తిస్మము పొందగా ఇదిగో ఈయన నా ప్రియ

కుమారుడని తండ్రియైన దేవుడు ఆకాశమునుండి సాక్ష్యమిచ్చెను. (మత్తయి 3:16,17). మరల యేసు ఒక కొండమీద రూపాంతరము పొందగా అదే సాక్ష్యపు పలుకులను దేవుడు ఆయనను గూర్చి మరల పలికెను (మత్తయి 17:1-5). యేసుయొక్క శిష్యులు కూడ ఆయన నిజముగా దేవుని కుమారుడని చెప్పి ఆయనకు మ్రొక్కిరి (మత్తయి 14:34). దయ్యములు పట్టిన మనుష్యులు కూడ యేసు దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చిరి (మత్తయి 8:29). ఆయన దేవుని కుమారుడని చివరకు అపవాది కూడ ఒప్పుకొనెను (మత్తయి 4:3). అంతేకాదు యేసును సిలువవేసిన సైనికులు సహా నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి (మత్తయి 27:54).

క్రీస్తు దేవుని కుమారుడనని తనను గూర్చి తాను చెప్పుకొనెను (మత్తయి 27:43). నేటి వేదాంతులు ఆయన ఒక సత్పురుషుడేగాని దేవుని అద్వితీయ కుమారుడు కాడని చెప్పుదురు. సత్పురుషులు అబద్ధమాడజాలరు. ఆయన దేవుని కుమారుడు కానియెడల సత్పురుషుడెట్లు కాగలడు ? ఆయనను గూర్చి నీకేమి తోచుచున్నది? ఆయన దేవుని కుమారుడని దైవవేదము ఘోషించుచున్నది. అయితే నీయభిప్రాయ మేమిటి ? ఆయన యెవరి కుమారుడు?

**యేసు చేసిన బోధలు ఆయన దేవుని కుమారుడు సాక్ష్యమిచ్చుచున్నవి:**

ఆయన ప్రజలకు బోధించినప్పుడూ వారి శాస్త్రులవలె గాక అధికారము గల వానివలె వారికి బోధించెను (మత్తయి 7:29). ఆయనలో సహజముగాయున్న అధికారమును బట్టి మానవులకంటె ఉన్నతునిగా ఆయన అగుపడెను. ఆయన భవిష్యత్తును సంపూర్ణముగ ఎరిగినవానివలె ఖచ్చితముగా బోధించెను. మనుష్యుల అంతరంగిక స్వభావమును ఆయన ఎరిగియుండెను. అందు వలన ఆయన మానవులకంటె మిన్నయైన వాడని నిరూపించుకొనెను. యేసు అందరిని ఎరిగినవాడు. ఆయన మనుష్యుని అంతర్యమును ఎరిగినవాడు. గనుక ఎవడును మనుష్యునిగూర్చి ఆయనకు సాక్ష్యమియ్య నక్కరలేదు అని యోహాను 2:24,25లో వ్రాయబడి యున్నది.

యేసు చేసిన బోధ అంతయు సంపూర్ణమైనది, శ్రేష్ఠమైనది. ఆయన బోధలను వేదాంతులు, విగ్రహారాధికులు, దేశనాయకులు, యూదులు, క్రైస్తవులు మొదలగువారనేక రీతులుగ పరిశోధించుచునే యున్నారు. అయితే నేటివరకు

ఏ మానవుడు కూడ ఆయన బోధలో దోషమున్నట్లు చెప్పలేక పోవుచున్నాడు. అందుకే యూదుల ప్రధాన యాజకులు పరిసయ్యులు యేసును పట్టుకొనుడని కొందరు బంట్రోతులను పంపితే వారాయనను పట్టుకొనలేదు సరిగదా ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదని సాక్ష్యమిచ్చిరి (యోహాను 7:46).

**యేసు చేసిన క్రియలు ఆయన దేవుని కుమారుడని నిరూపించుచున్నవి.**

"నేను నా తండ్రి క్రియలు చేయని యెడల నన్ను నమ్మకుడి, చేసిన యెడల నన్ను నమ్మకున్నను తండ్రి నాయందును నేను తండ్రియందును ఉన్నామని మీరు గ్రహించి తెలిసికొనునట్లు ఆ క్రియలను నమ్ముడని" క్రీస్తు బోధించెను (యోహాను 10:38). ప్రకృతిశక్తుల మీద ఆయన అధికారము కలిగియుండెను. ఆయన తుఫానును గద్దింపగా గాలి, సముద్రము నిమ్మళ మాయెను (మత్త8:23-27). ఆయన నీటిపై నడచెను. నీళ్ళను ద్రాక్షారసముగా మార్చెను.

మనుష్యులను పీడించు వ్యాధు లపై ఆయన అధికారము కలిగి యుండెను. కుష్టురోగి ఒకడు వచ్చి ఆయనకు మ్రొక్కి ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధునిగ చేయగలవనెను. అందుకాయన చెయ్యి చాపి వానిని ముట్టి నాకిష్టమే, నీవు శుద్ధుడవుకమ్మని చెప్పగా తక్షణమే వాని కుష్టురోగము శుద్ధియాయెను (యోహాను 8:2-4). పండ్రెండు సంవత్సరముల నుండి రక్త స్రావముచే బాధపడుచున్న స్త్రీ యొకతె ఆయన వస్త్రపుచెంగు ముట్టెను. యేసు వెనుకకు తిరిగి ఆమెను చూచి కుమారీ, ధైర్యముగా ఉండుము. నీ విశ్వాసము నిన్ను బాగుపరచెనని చెప్పగా, ఆ గడియనుండి ఆ స్త్రీ బాగుపడెను (మత్తయి 9:20-22).

రోగమే కాదు, మరణము కూడ క్రీస్తుకు లోబడెను. ఆయన చనిపోయిన లాజరును మరల బ్రతికించెను. యేసు అనేక అద్భుతములను చేసెను. వాటిలో కొన్ని మాత్రమే క్రొత్త నిబంధనలో వ్రాయబడెను. మనము యేసునందు విశ్వాసముంచ గల్గునట్లు వ్రాయబడిన సంగతులను మనము నిరభ్యంతరముగా నమ్మవచ్చును. బైబిలును వ్రాసిన లేఖకులు దేవుని ఆత్మచే నడిపింపబడిరి. సరిగదా వారు ఏది వింటిరో, కన్నులార ఏది చూచితిరో, నిదానించి ఏది కనుగొంటిరో, వారి చేతులు దేనిని తాకి చూచెనో దానిని గూర్చి వారు వ్రాసిరి అంతేకాదు ఆ లేఖకులు తాము విశ్వసించిన దానికొరకు తమ ప్రాణములను కూడ అర్పించిరి. గనుక వారిచ్చిన సాక్ష్యము యధార్థమని మన

మంగీకరించవచ్చును.

క్రీస్తు ఈ లోకమునందుద్భ వించినది మొదలుకొని చరిత్ర యొక్క గతియే మార్చబడినది. కాలము ఆయన రాకడను బట్టి లెక్కింపబడుచున్నది. నాటినుండి నేటి వరకు ఆయన నామము లోకమందంతట ప్రకటింపబడుచుండగా కోట్లకొలది ప్రజలు ఆయన దేవుని కుమారుడని విశ్వసించి ఆయనకు విధేయులగుచున్నారు. మిత్రుడా, క్రీస్తుని గూర్చి నీకేమి తోచుచున్నది? ఆయన దేవుని కుమారుడని నిరూపించు అనేక ఋజువులను ఈనాడు నీకు చూపించితిని. నీవు నీ పాపములనుండి విముక్తుడవు కావలెనంటే యేసునందు విశ్వాసముంచుము. నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము. క్రీస్తు నామమును బహిరంగముగా ఒప్పు కొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. క్రీస్తే దేవుని కుమారుడని లోకానికి ప్రకటించుచూ ఆనంద జీవితము జీవించుము.

## పరిసయ్యుడు -సుంకరి
## (The Pharisee and the Publican)
### లూకా 18:9-14

**పరిచయము :**

పరిసయ్యుడు-సుంకరి యొక్క ఉపమానము లూకా సువార్తలో మాత్రమే లిఖించబడియున్నది. అన్యాయస్థుడైన న్యాయాధిపతిని గూర్చిన ఉపమానము చెప్పబడిన వెనువెంటనే యిది మనకు కనబడును. ఈరెండు ఉపమానముల ముఖ్యాంశము ప్రార్థనయై యున్నది. మొదటిది ప్రార్థన మనస్ఫూర్తిగా, విసుగక చేయవలెనని బోధించితే యిది, ప్రార్థన వినయముతో యుండాలని బోధించు చున్నది. "తామే నీతిమంతులమని తమ్ము నమ్ముకొని యితరులను తృణీకరించు కొందరితో" యేసు ఈ ఉపమానము చెప్పెను (లూకా 18:9).

ఇద్దరు వ్యక్తులు ముఖ్యముగా ఈ ఉపమానములో మనకు కనబడు దురు. పరిసయ్యుడు, సుంకరి.

'పరిసయ్యుడు' అనగా ప్రత్యేకిం పబడినవాడని అర్థము. ఈ గుంపుపాత క్రొత్తనిబంధనల మధ్య కాలములో యూదులలో ఉద్భవించిరి. హెబ్రీయులు గ్రీకు సాంప్రదాయముననుసరించుటను వీరు వ్యతిరేకించిరి. యేసు కాలములో

ఇంచుమించు 6000 మంది పరిసయ్యు లుండిరి. వారు యూదా మతమును గూర్చి నిష్ఠగలవారే అయినను (అపొ.కా. 26:5) వారు పారంపర్యా చారములను గూర్చి పట్టుదల కలిగి యుండి దేవుని వాక్యమును వ్యర్థము చేసిరి (మత్తయి 15:1-9). పరిసయ్యులు సాధారణంగా స్వనీతిపరులు, వేష ధారులు.

పరిసయ్యుడు యూదా సమాజ ములో అత్యున్నత స్థాయిలో ఎంచబడితే సుంకరి అతినీచస్థాయిలో ఎంచబడేవాడు. పరిసయ్యులు ఘనపరచబడేవారు, గౌరవించబడేవారు, సుంకరి వెలివేయ బడినవాడు, దేశద్రోహి, దొంగ. యేసు వీరిద్దరి తారతమ్యాన్ని గూర్చి చెప్పడం చాల ఆశ్చర్యము.

సుంకరులు యూదులే. వారు యూదులనుండి రోమా ప్రభుత్వము కొరకు పన్ను వసూలు చేసేవారు. తమపై ఏలుబడి చేయుచున్న రోమీయుల దరపున వీరు పన్ను వసూలు చేయుచు న్నందున మిగతా యూదులు వీరిని దేశద్రోహులు గాను, దొంగలుగాను, అంటరాని వారిగాను పరిగణించేవారు. పన్ను వసూలు చేసేవారు సర్వ సాధారణంగా ప్రజలకు ఇష్టులుకారు. యూదులు వీరిని అన్యులతోను (మత్త 18:7), వేశ్యల తోను (మత్త 21:31-33), పాపులతోను (మత్త 9:10; లూకా 7:34; 15:1) సమానముగా ఎంచే వారు. పొట్టి జక్కయ్య (లూకా 19:1-9), అపొస్తలుడైన మత్తయి (మత్త 9:9; 10:2-5) ఈ యిద్దరు సుంకరులే. యేసు తన పరిచర్యలో వీరిద్దరిని ఇమిడ్చి యున్నారు.

**ఉపమానము :**

"తామే నీతిమంతులమని తమ్ము నమ్ముకొని యితరులను తృణీకరించు కొందరితో ఆయన ఈ ఉపమానము చెప్పెను. ప్రార్థన చేయుటకై యిద్దరు మనుష్యులు దేవాలయమునకు వెళ్లిరి. వారిలో ఒకడు పరిసయ్యుడు, ఒకడు సుంకరి. పరిసయ్యుడు నిలువబడి- దేవా నేను చోరులును అన్యాయస్థులును వ్యభిచారులునైన యితర మనుష్యుల వలెనైనను, ఈ సుంకరివలెనైనను ఉండనందుకు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. వారమునకు రెండుమారులు ఉపవాసము చేయుచు, నా సంపాదన అంతటిలోను పదియ వవంతు చెల్లించుచున్నానని తనలో

తాను ప్రార్థించుచుండెను. అయితే సుంకరి దూరముగా నిలుచుండి ఆకాశమువైపు కన్నులెత్తుటకైనను ధైర్యముచాలక రొమ్ము కొట్టుకొనుచు – దేవాపాపినైన నన్ను కరుణించుమని పలికెను. అతనికంటె యితడు నీతిమంతుడుగా తీర్చబడి తన యింటికి వెళ్లెనని మీతో చెప్పుచున్నాను. తన్నుతాను హెచ్చించు కొనువాడు తగ్గింపబడుననియు తన్నుతాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడుననియు చెప్పెను" (లూకా 18 : 9–14).

వారు ప్రార్థించేటప్పటి భంగిమ సమస్యకాదు, వారిద్దరు నిలబడియే ప్రార్థించుచుండిరి. బైబిలులో వివిధ భంగిమలలో ప్రార్థించుటమనము చూడగలము. ఉదా: మోకాళ్లూని (1 రాజులు 8:54, 2 దినవృ 6:13; కీర్తన 95:6; యెష 45:23; లూకా 22:41; అపొ.కా. 7:60; ఎఫెసీ 3:14). తలవంచుకొని (ఆది.కా. 24:52; మత్త 26:39; మార్కు 14:35), నిలబడి చేతులెత్తి (1 రాజులు 8:22; 1 సమూ 1:26; మార్కు 11:25; లూకా 18:11). ప్రార్థించిరి.

పరిసయ్యుడు వింతైన రీతిగా ప్రార్థించాడు. అతడు దేవునికి కాదుగాని తనలో తనకే ప్రార్థించాడు. స్వయం సంతృప్తికొరకు ప్రార్థించాడు. ఎంత వింతయో! తన ప్రార్థనలో కృతజ్ఞత లేదు, దేవునికి ఘనత ఎంతమాత్రము ఆపాదించలేదు. దేనినీ అడుగలేదు, దేనినీ ఒప్పుకోలేదు, దేనినీ పొందలేదు! అతడు 34 మాటలు పలికితే సుంకరి నాలుగే నాలుగు మాటలు పలికాడు.

పరిసయ్యుని ప్రార్థన అహంకారముతో కూడినది. తాను ఏమేమి కాదో వల్లించాడు... అతడు అన్యాయస్థుడు కాదు, దోచుకొనేవాడు, వ్యభిచారి కాదు! తదుపరి తన 'సద్గుణములను' వల్లించాడు. వారమునకు రెండు మారులు ఉపవాసము చేయుచున్నాడు, అన్నిటిలోను దశమభాగము చెల్లించుచున్నాడు! పరిసయ్యులు సాధారణంగ సోమవారము, గురువారము ఉపవాసముండేవారు. ఏలయనగా మోషే సీనాయి కొండపైకి సోమవారంనాడు ఎక్కి గురువారము దిగివచ్చాడని వారు తలస్తారు. ఈ పరిసయ్యుడు నిజానికి అనీతిపరుడు కాదు. మనుష్యులు ఎట్లు అతని పరిగణించినా దేవుడు మాత్రం అతని అంగీకరించలేదు (2 కొరింథీ 5:10). ఒకనిలో ఎన్ని సద్గుణములున్నా

పాపము వలన అవి మరుగు చేయబడ్డాయి (యెహెజ్కే 33:13). ఈ పరిసయ్యుడు తన పాపపు జీవితాన్ని గూర్చి గ్రుడ్డివాడయ్యాడు.

సుంకరి అయితే పరిసయ్యునికంటె భిన్నమైన స్వభావమును ప్రదర్శించెను. అతడు తన లోపములను ఎరిగి యుండెను. దేవాలయములో ప్రార్థించ డానికి వెళ్లిన వీరిద్దరు భిన్నమైన ప్రవర్తన, విశ్వాసము, స్వపరీక్ష గలవారు. పరిసయ్యుని వలెగాక సుంకరి ప్రాముఖ్య స్థలములో నిలబడి యుండ లేదు. తన్నుతాను తగ్గించు కొన్నాడు. తాను పలికిన మాటలను బట్టి దేవునికి దగ్గరయ్యాడు!

అతడు దూరమున నిలుచుండినను, దేవునికి దగ్గరగా యున్నాడు (కీర్త 51:17). ఎజ్రావలె అతనికి ఆకాశమువైపు కన్ను లెత్తుటకు ధైర్యము లేకపోయెను నాలుగు మాటల ప్రార్థనే, అయినను అది దేవుని సన్నిధికి చేరెను. తన ప్రార్థనలో అతడు మూడు సంగతులను గుర్తించాడు. తానొక గొప్పపాపి, శిక్షార్హుడు, పాపక్షమాపణకు, కరుణను విన్నవించుకొన్నాడు. పౌలువలె తాను పాపులలో ప్రధానుడనని ఒప్పు కున్నాడు (1 తిమోతి 1:15).

ఈ యిద్దరి మనుష్యుల యొక్క ఆత్మీయస్థితిని యేసు బేరీజు వేసారు. పరిసయ్యుడు తాను నీతిమంతుడనని అంచనా వేసుకొన్నాడు. యేసు అతనిని వేరేవిధంగా ఎంచారు. సుంకరి తాను అనీతిమంతుడననుకొన్నాడు. గాని యేసు ఆయభిప్రాయముతో ఏకీభవించ లేదు. గర్విష్టుడైన పరిసయ్యుని దించి. సాత్వికుడైన సుంకరిని పైకెత్తారు. అతని కంటె యితడు నీతిమంతునిగా తీర్చబడి తమ తమ యిండ్లకు వెళ్లారు.

**ముగింపు :**

పరిసయ్యుడు సుంకరిని గూర్చిన ఉపమానము ప్రార్థనను గూర్చి ప్రార్థించే సమయములో ఒకని మనస్తత్వమును గూర్చి ఉపదేశించుచున్నది. పరిసయ్యుడు తన్నుతానే ఉన్నతునిగా ఆలోచించు కొనెను. దేవుడు ఉన్నతుడు, ఆరాధనీయుడని మరచిపోయాడు. ఇతరులను హీనముగా ఎంచాడు. పాపియైన తాను వేరొకపాపికి తీర్పు తీర్చుట మంచిది కాదని అతడు మరిచాడు.

క్రైస్తవులు తమ జీవితములను బైబిలు బోధతో సరిచూచుకోవాలి (మత్త 7:15-20; 1 యోహా 4:1).

- లూయిస్ రష్‌మోర్

# దహన బలి యొక్క వివరణ
# (Explanation of the Burnt Offering)

**దేవుని బల్యర్పణ పద్ధతి -6**

ఈపాఠము హెబ్రీయులు మొదటిది మరియు అతి ప్రాముఖ్యమైన బలిని గూర్చి వివరించును. అది దహన బలి. మోషేధర్మశాస్త్ర ప్రకారమున్న బలులన్నిటిలోను యిది ప్రత్యేకమైనది. యిది ఇంపైన సువాసన గల యాగము గనుక యిది ఆరాధన సంబంధమైనది.

**ఓలా (olah)**

దహన బలి హెబ్రీ భాషలో ఓలా అని పిలువబడినది. అది గ్రీకులో holocautoma అని తర్జుమా చేయ బడినది. Holocaust అనగా సంపూర్ణ నాశనము అని యర్థము. అయితే ఈ అర్పణ పూర్తిగా నాశనమయ్యేది అని గాక, అదిపూర్తిగా ధూప స్తంభమువలె పరలోకమునకు పంపబడును. అర్పణ లన్నిటి కంటె యిది సంపూర్తిగ దేవునికి చెందినది. అది ఆయన సంతోషార్థము సమర్పించ బడినది. బలిపీఠము నుండి అగ్నిపైకి లేచుచుండగా, దేవుడు దానిని అఘ్రాణించుచు సంతోషించుచున్నారని ఆరాధకుడు తలంచును. అది ఆయనకు ప్రీతికరముగా యుండెనని అతడు భావించును.

దహనబలి ప్రాముఖ్యమైనది ఏలయనగా బలులన్నిటికంటె అది సంపూర్తిగా దేవునికే చెందినట్టిది. అది పూర్తిగా దేవుని సంతోషము కొరకే అర్పించబడినది. ఈ బలిలో ఏదియు కూడ వేరొకనికి ఇయ్యబడదు. అది దేవునికి, దేవునికి మాత్రమే. మిగతా బలులలో పశువులు, శాఖాహారధాన్య ములు వగయిరా విషయములలో యితరులు కొంత లబ్ధిపొందుదురు. అర్పింపబడిన దానిలో కొంతభాగాన్ని వారందరు పొందుదురు గాని దహన బలి విషయంలోకాదు. యిది సర్వ సంపూర్ణముగా దేవునికే చెందునది. "అది యెహోవాకు యింపైన సువాసన గల దహన బలియగునట్లు యాజకుడు దానినంతయు బలిపీఠము మీద దహింపవలెను" అని లేవీ 1:9లో చెప్ప బడినది. గనుక ఈయర్పణ సింపుల్‌గా అంతయు దేవుని వైపు మార్చబడు చున్నది. అది బలిపీఠము నుండి సంపూర్తిగా దేవునికి ధూమ రూపముగా పంపించబడుచున్నది.

**మనుష్యునికి బదులుగాజంతువు :**

ఆరాధకునిగా బదులుగా జంతువు అర్పించబడుట జరుగును. ఆ జంతువుకు యేమి జరిగినా అది

మానవునికే జరుగుచున్నట్లు భావించబడును. ఆ జంతువు సంపూర్తిగా పొగ రూపేణ దేవునికి సమర్పించబడుచున్నప్పుడు, తర్జుమాచేయ బడుచున్నప్పుడు, ఆత్మీయ భావముగల యూదుడు దేవునితో ఇట్లు చెప్పకొనును: "నిన్ను సంతోష పెట్టుటకు ఈ జంతువును సంపూర్తిగ సమర్పించినయట్లే, నా జీవితం సంపూర్తిగా నీకు మాత్రమే సమర్పించుచున్నాను". ఆ జంతువుకు భౌతికంగా యేమి జరుగుచున్నా అది ఆరాధించువాని ఆత్మీయ కోరిక చొప్పున జరుగును. "నా జీవితం సంపూర్తిగ దేవునికి ప్రీతికరముగా యుండునట్లు సమర్పించుకొనుచున్నాను".

అబ్రాహాము ఇస్సాకును దేవునికర్పించెను.

ఆదికాండము 22వ అధ్యాయములో అబ్రాహాము తన ఏకైక కుమారుడైన ఇస్సాకును దహన బలిగా అర్పించుమని దేవుడు కోరెను. దహన బలి యొక్క తత్వమును ఈ సంఘటన మనకు కొంత తెలియజేయును. "నీకు ఒక్కడై యున్న నీకుమారుని అనగా నీవు ప్రేమించు ఇస్సాకును తీసికొని మోరియాదేశమునకు వెళ్లి అక్కడ నేను నీకు చెప్పబోవు పర్వతములలో ఒక దాని మీద దహనబలిగా అర్పించుమని" దేవుడు చెప్పెను (ఆది.కా. 22:2). అబ్రాహాము ఇస్సాకును బలిపీఠము మీద ఉంచి అతనిని దేవునికి ఇంపైన సువాసనగా మార్చి పరలోకమునకు దానిని పంపించుమని కోరెను. గతంలో అబ్రాహాము దహనబలులనర్పించెను. ఆబలి అర్పించిన తరువాత యేమి మిగిలియుండునో అతడు బాగుగా ఎరుగును.... బూడిదమిగులును!!.

ఈ అనుభవము నుండి అబ్రాహాము యేమినేర్చుకోవాలని దేవుడుకోరారు? ఆయన ఇట్లుకోరారు: "బేషరతుగా ఇస్సాకును నా కర్పించుము. సంపూర్తిగా అతడు నాకు కావాలి". అబ్రాహాము ఇస్సాకుతో కూడ తన యింటి నుండి బయలుదేరాడు, తన సేవకులతో కలిసి మూడు దినములంత ప్రయాణము చేసాడు. మోరియా కొండకు వారు చేరుకొన్నారు. అతడు తన పనివారితో, "మీరు గాడిదతో ఇక్కడనే యుండుడి, నేను ఈ చిన్నవాడును అక్కడికి వెళ్లి దేవునికి మ్రొక్కి మరల మీ యొద్దకు వత్తుమని" చెప్పాడు (ఆదికా 22:5).

అతడేమి చేయబోవుచున్నాడో అబ్రాహాము బాగుగా ఎరిగిన వాడై యుండెను. ఇస్సాకును దేవునికి బహుమతిగా బలి అర్పించబోవుచున్నాడు! గాని దానిని ఆరాధనయని అతడు పిలిచాడు. ఆరాధనలోని యిట్టిభావములు దహన బలియొక్క ముఖ్య ఉద్దేశ్యమై యున్నది. "మేము వెళ్లి దేవునికి మ్రొక్కి (ఆరాధించి) మరల

మీ యొద్దకు వత్తుము" అని అబ్రాహాము చెప్పిన మాటలు ఆసక్తికరమైనవి. ఇస్సాకును బలియర్పించినా, ఏదోరీతిగా దేవుడతనిని బ్రదికించునన్న విశ్వాసమును అబ్రాహాము ప్రకటించాడు, దేవుడతనికి అప్పటికే కొన్ని వాగ్దానములు చేసారు, మరియు ఆదికాండము 12,15 అధ్యాయలలో ఆయన అతనితో నిబంధన చేసారని అబ్రాహాము ఎరుగును. ఇస్సాకు ద్వారా అబ్రాహాము గొప్ప సంతతిని పొంద బోవుచున్నాడు. గొప్ప జనాంగము ఇస్సాకులో నుండి కలుగబోవుచున్నది.

అయినను అబ్రాహాము ఇస్సాకును బూడిదై గుట్టగా మార్చుమని దేవుడు అడిగారు. అబ్రాహాము అందుకు సిద్ధపడ్డాడు. జీవాధిపతియైన దేవుడు జీవమును తీసికొనినను దానిని మరల యిచ్చునని అతడెరుగును. అబ్రాహాము యొక్క విశ్వాసము ఇట్లు వర్ణించబడినది. "అబ్రాహాము శోధింపబడి ఇస్సాకును బలిగా అర్పించెను. ఎవడు ఆ వాగ్దానములు సంతోషముతో అంగీకరించెనో, ఇస్సాకు వలననైనది నీ సంతాన మన బడును అని యెవనితో చెప్పబడెనో ఆ అబ్రాహాము మృతులను సయితము దేవుడు లేపుటకు శక్తిమంతుడని యెంచినవాడై తన యేక కుమారుని అర్పించి ఉపమానరూపముగా అతనిని మృతులలోనుండి మరల పొందెను" (హెబ్రీ 11:17-19). అబ్రాహాము తన కుమారుని చంపడానికి సంకల్పించాడు, తరువాత దేవుడతని లేపుతాడని విశ్వసించాడు.

**ఇస్సాకు యొక్క దృక్కోణం :**

ఈ సంఘటనలో ఇస్సాకు యేమి చూడాలని దేవుడుకోరారు? "ఇస్సాకు, ఆ గొర్రెపిల్ల నీ స్థానంలో బలి అర్పించ బడినది. అయినను నీవు నీ బాధ్యతల నుండి విడిపింపబడలేదు. నీవే నా బలిగా యుండాలి. నీవు సజీవయాగముగా నాకుండాలి, నీ జీవితమంతయు నాకు సంపూర్తిగ సమర్పించుకోవాలి!"

బలిపీఠముపై గొర్రెపిల్ల దహించ బడుచు ఆకాశమువైపు లేచుచున్న పొగలను గమనిస్తు యున్న ఇస్సాకును గూర్చి ఒకసారి ఆలోచించుము. మంటలలో గొర్రెపిల్ల కాలిపోవుచు సాంబ్రాణి పొగలు పైకి ఆకాశమువైపు లేచుచుండగా ఇస్సాకు, "నేనే ఆ గొర్రెపిల్లనని" భావించును. దేవుడు కోరేది అదే. ఆయన ఇస్సాకును కోరుకొన్నారు. గాని బూడిదగా మారిన ఇస్సాకును కాదు! బూడిదగా మారిన బలిని కాదు! సరిగదా ఇస్సాకు నిత్యము దేవునికి సమర్పించు కొనుచు సజీవ యాగముగా యుండాలని దేవుడు కోరుకొన్నారు. గొర్రెపిల్ల అర్పింపబడిన స్థలమును అబ్రాహాము 'యెహోవా యీరే' అని పిలిచాడు. అనగా దేవుడే చూచు

కొనును!

తనకుబదులుగా యెహోవా ఒక గొఱ్రెపిల్లననుగ్రహించినందుకు ఇస్సాకు నిజముగా దేవునికి కృతజ్ఞత చెల్లించి యుండవచ్చును. మోరియా కొండ మీద జరిగిన సంఘటన తదనంతరము దేవుడు మనకు బదులుగా వేరొక దానిని యిచ్చుటకు (అంగీకరిం చుటకు) విరమించుకొనలేదు. ఆయన యేసు క్రీస్తును మనస్థానములో అనుగ్రహించారు!.

బహుశ అందువలన ఈదహన బలి హెబ్రీయులలో ప్రగాఢమైన భావములు:

ఉద్భవింపజేయును. దేవునికి నిన్ను నీవు సమర్పించుకొను గొప్ప తరుణము యిది !. 2 కొరింధీ 8:5లో మాసిదొనియలోని సహోదరులు "మొదట ప్రభువునకును, దేవుని చిత్తము వలన మాకును తమ్మును తామే అప్పగించుకొనిరి" యని చదువ గలము. యేసు ప్రభువు కూడ అదే చేసారు. ఆయన సర్వసంపూర్తిగ దేవునికి అప్పగించుకొన్నారు!. యేసుప్రభువు నిత్యము దహించబడుచున్న దహనబలియై యున్నారు!.

**సర్వసాధారణ యాగము :**

దహన బలి యూదులలో సర్వసాధారణ బలియాగమై యున్నది. వారి ఆరాధన అంతటికి అది కేంద్రమై యుండెను. ఒక వ్యక్తి తానెప్పుడు కోరుకొనినా అప్పుడు దహనబలి అర్పించవచ్చును. మరియు ఆజనాంగము కొరకు ప్రతిదినము ఉదయము, సాయంత్రము కూడ అర్పింపబడుచుండెను. లేవీ 6:9,12,13 లో బలిపీఠము మీద అగ్ని దహించుచు యుండవలెను, అగ్నిమండుచుండవలెను, ఆరిపోకూడదు అని యెహోవా ఆజ్ఞాపించెను. ఇంకొకమాటలో యాజక జనాంగముగా మీ భక్తి విశ్వాసములు నిత్యము నాయెడల యుండవలెనని దేవుడు కోరెను. అది సబ్బాతు చర్యకాదు, అది ప్రతిదినము, ప్రతిమాసము, ప్రతిసంవత్సరము దేవుడు తన ప్రజలు ఈ బలియాగచర్యలో నిమగ్నులై యుండాలని కోరెను, హెబ్రీయులు బలులు అర్పించే బలిపీఠము అందుకే దహన బలిపీఠమని పిలువబడినది.

**ఆరాధనకు కేంద్రము :**

దహన బలియాగము ఆరాధనకు కూడ కేంద్రమైయుండెను. వారి పండుగ దినములన్నిటికి, సబ్బాతుకు అది కేంద్రమై యుండెను. అది అత్యధికంగా దైవ కేంద్రమై యుండెను. అది అత్యధికంగా దైవ కేంద్రీకృతమైనది. అందు వలన అత్యధికంగా ఆత్మీయమైనది. మానవుని భక్తి విశ్వాసములలో భంగము వాటిల్లితే పరిహారబలి అవసరం. ఆరాధకుడు తానుండవల

ినంత శ్రద్ధగా దేవుని యెడల లేదని దాని యర్ధం.

**ఏదెను నీడలలోనుండియు అర్పించబడెను**

బైబిలు అంతటిలో దహనబలి అతి పురాతనమైనది. మనము బైబిలులో చదివే మొదటి బలి అది. ఏదెను వనంలో హేబెలు అర్పించిన అర్పణ దహన బలియే (ఆది.కా.4:4). నోవహు ఓడలో నుండి బయటికి వచ్చిన తరువాత యెహోవాకు బలిపీఠము కట్టి పవిత్ర పశువులన్నిటిలోను, పక్షులన్నిటిలోను కొన్ని తీసికొని ఆపీఠము మీద దహన బలి అర్పించెను (ఆది.కా. 8:20-21). అప్పుడు యెహోవా అయింపైన సువాసన నాఘ్రాణించి నోవహుతోను అతని సంతతి తోను నిబంధన చేసికొనెను. తానెన్నడు భూమిని జల ప్రళయముతో నాశనము చేయనని దేవుడు నిబంధన చేసెను. ఆనిబంధనను స్థిరపరచుచు గురుతుగా ఆయన అకాశములో ధనస్సును (Rain bow) ఉంచెను (ఆదికా. 9:11-14). పితరులందరు తమదహన బలులను దేవుని కర్పించుటలో నమ్మకము గా యుండిరి.

## పడిపోవుట - నిలిచియుండుట

1కొరింథి 10:12 "తాను నిలుచు చున్నానని తలంచుకొనువాడు పడ కుండునట్లు జాగ్రత్తగా చూచుకొన వలెను"

మనక్రైస్తవ విశ్వాస జీవితములో జాగ్రత్తగా నిలిచియుండునట్లు చూచు కొనవలెను అపొ.పౌలు కొరింథులో నున్న క్రీస్తు సంఘమునకు ఉత్తరం వ్రాసాడు. ఈ ఉత్తరం ద్వారా ఆయన హృదయము ఎంతగా గాయపడినది తెలియుచున్నది. పరిశుద్ధమైన సంఘము లో విభేదములు వచ్చినవి. కక్షలు, కలహ ములు మఠాతత్వాలు, వర్గపోరాటములు వచ్చినవి. "ఒకడు నేను పౌలువాడను, ఒకడు - నేను అపొల్లోవాడను, మరి యొకడు నేను కేఫావాడను ఇంకొకడు నేను క్రీస్తువాడను అని చెప్పుకొను చున్నారు" (1కొరింధీ 1:12).

విగ్రహములకు బలిఇచ్చిన వాటిని తినుచున్నారు, జారత్వము, వ్యభిచారము వారిలో కొందరిలో ఉన్నది. కొందరు ఉప్పొంగుచున్నారు కొందరు అతిశయించు చున్నారు. అందుచే పౌలు వారిని ఈలాగు హెచ్చరించుచున్నాడు. "తాను నిలుచుచు న్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను"

1కొరింథీ 10:1-12 వచనముల ద్వారా సంఘమును హెచ్చరించుచున్నాడు 1 కొరింథీ 10:11 "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి

యుగాంతమందున్న మనకు బుద్ధికలుగుటకై వ్రాయబడెను".

ఏసంగతులు దృష్టాంతములుగా వ్రాయబడెనో పరిశీలింతము :-

1 కొరింథీ 10:2-6"మన పితరులందరు మేఘముక్రింద నుండిరి వారందరును సముద్రములో నడిచిపోయిరి అందరూ మోషేను బట్టి మేఘములోను సముద్రములోను బాప్తిస్మమొందిరి. అందరూ ఆత్మసంబంధమైన ఆహారము భుజించిరి. అందరూ ఆత్మసంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన బండలోనిది త్రాగిరి ఆబండక్రీస్తే".

అయితే కొందరు పడిపోయిరి. కొందరు అరణ్యములో సంహరింపబడిరి.

ఎ) పడిపోవుటకు కారణములు :-

**1. దేవునికి ఇష్టులుగా లేరు :**

1 కొరింథి 10:5 అయితే వారిలో ఎక్కువమంది దేవునికి ఇష్టులుగా ఉండకపోయిరి. గనుక అరణ్యములో సంహరించబడిరి.

చాలా మంది ఊరందరికి ఇష్టులుగా ఉంటారు వారికి కావలసిన వారికి ఇష్టులుగా ఉంటారు. గాని దేవునికి ఇష్టులుగా ఉండరు. గలతి 1:10లో అపొ.పౌలు ఈలాగు చెప్పుచున్నాడు. "ఇప్పుడు నేను మనుష్యుల దయను సంపాదించుకొన జూచుచున్నానా? నేను మనుష్యులను సంతోషపెట్ట గోరుచున్నానా? నేనిప్పటికిని మనుష్యులను సంతోషపెట్టువాడనైతే నేను క్రీస్తు దాసుడను కాకపోవుదును"

**2. చెడ్డవాటిని ఆశించుట :**

1కొరింథీ 10:6" వారు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుండునట్లు ఈసంగతులు మనకు దృష్టాంతముగా ఉన్నవి". వారు తిండిని, మత్తును, ఐహిక విచారములను ఆశించారు. కొలస్సీ 3:5-11 ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడా పరిత్యజించాలి.

**3. విచ్చలవిడితనము :**

1 కొరింథీ 10:7 "జనులు తినుటకును, త్రాగుటకును కూర్చుండి ఆడుటకు లేచిరి".

నిర్గమ 32:6 "వారు ఉదయమున లేచి దహన బలులను, సమాధానబలులను అర్పించిరి. జనులు తినుటకు త్రాగుటకును కూర్చుండి ఆటలాడుటకు లేచిరి". "అందుచేత ప్రజలలో ఇంచుమించు మూడు వేల మంది కూలిరి". నిర్గమ 32:28.

**4. విగ్రహారాధికులు :**

1కొరింథీ 10:7 "వారిలో కొందరివలె విగ్రహారాధికులై యుండకుడి".

కొలస్సీ 3:5 విగ్రహారాధనయైన ధనాపేక్ష కల్గియుండరాదు. మోషే సీనాయి కొండపైకి వెళ్ళినపుడు ఇశ్రాయేలీయులు బంగారు దూడను పోతపోసి దానికి పూజించిరి.

దేవునికంటే దేనిని ఎక్కువగా ప్రేమించినా అది విగ్రహారాధన. అన్యుల ఆచారాలను పాటించినా అది విగ్రహా రాధన. 1కొరింథీ 10:14 "విగ్రహారాధనకు దూరముగా పారి పోవుడి" 1 యోహాను 5:21 "చిన్న పిల్లలారా విగ్రహముల జోలికిపో కుండా జగ్రత్తగా ఉండుడి".

**5. వ్యభిచారము :**

1కొరింథీ 10:8 "వారివలె మనము వ్యభిచరింపక యుందము వారిలో కొందరు వ్యభిచరించినందున ఒకదినమందే 23 వేల మంది కూలిరి".

సంఖ్యా 25:1,2 మోయాబు రాంద్రతో వ్యభిచారము చేసిరి. ఆస్త్రీలు తమదేవతల బలులకు ప్రజలను పిలువగా వీరు భోజనము చేసి వారి దేవతలకు నమస్కారముచేసిరి".

సంఖ్య 25:9 ఇరువదినాలుగు వేలమంది ఆ తెగులు చేత చనిపోయిరి.

క్రొత్త నిబంధనలో ఒకస్త్రీని మోహపుచూపుతో చూస్తేనే అది పాపము. ఇతరులు మనలను చూచినపుడు పాపపు ఆలోచనలు కలిగే విధముగా తయార వగూడదు.

**6. శోధించుట :-**

1కొరింథీ 10:9 "మనము ప్రభువును శోధింపక యుందము వారిలో కొందరు శోధించి సర్పముల వలన నశించిరి".

సంఖ్య 21:5,6 కాగా ప్రజలు దేవునికిని, మోషేకును విరోధముగా మాటలాడి ఈ అరణ్యములోచచ్చుటకు ఐగుప్తునుండి మీరు మమ్మునేల రప్పిం చిరి? ఇక్కడ ఆహారము లేదు నీళ్ళు లేవు చవిసారములు లేని ఈ అన్నము మాకు అసహ్యమైనది. అందుకు యెహోవా ప్రజలలోనికి తాపకరమైన సర్పములను పంపెను. అవి ప్రజలను కరువగా ఇశ్రాయేలీయులలో అనేకమంది చని పోయిరి.

కావున మనకు కలిగినవాటితో తృప్తికల్గి యుందము దేవుని శోధించక యుందము.

**7. సణుగుట :** 1కొరింథీ 10:10 "మీరు సణగకుడి వారిలో కొందరు సంహారకుని చేత నశించిరి"

నిర్గమ 16:3,4,13 వచనములలో ఆహారముకొరకు సణిగిరి". నిర్గమ 16:7 "యెహోవా మీద మీరు సణిగిన సణుగులను ఆయన వినుచున్నాడు".

నిర్గమ 17:3 "నీళ్ళ కొరకు సణిగిరి"

సంఖ్య14:1-4 "మనము నాయకుని ఒకని నియమించుకొని ఐగుప్తునకు తిరిగి వెళ్ళుదము" అని సణిగిరి. సంఖ్యా 14:29 "అనగా 20 ఏండ్లు మొదలుకొని పై ప్రాయము కలిగి నాకు విరోధముగా సణిగిన వారందరూ రాలి పోవుదురు" సంఖ్యా14:37 "కనాను దేశమును గూర్చి చెడ్డ సమాచారము ఇచ్చిన వారందరూ తెగులు చేత చని పోయిరి".

**బి. దేవునిలో నిలిచియుండుట : దేవునిలో నిలిచి యుండుటకు ఏమి చేయాలి ?**

**1. దేవునికి ఇష్టులుగా ఉండాలి:-**

హెబ్రీ11:5 "విశ్వాసమును బట్టి హనోకు మరణమును చూడ కుండునట్లు కొనిపోబడెను. అతడు కొనిపోబడకమునుపు దేవునికిష్టుడై యుండెను.

హెబ్రీ 11:6 "విశ్వాసములేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన ఉన్నాడనియు తన్ను వెదకువానికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెనుకదా?"

**2. దేవుని కొరకు ఆశపడాలి :**

ఇశ్రాయేలీయులు చెడ్డవాటిని ఆశించారు. కీర్తన 42:1,2 "దుప్పి నీటి వాగుల కొరకు ఆశపడునట్లు దేవా నీకొరకు నాప్రాణము ఆశపడుచున్నది. నాప్రాణము దేవుని కొరకు తృష్ణగొను చున్నది. జీవముగల దేవునికొరకు తృష్ణ గొనుచున్నది. దేవుని సన్నిధిని నేనెప్పుడు వచ్చెదను. ఆయన సన్నిధికి నేనెప్పుడు కనబడెదను.

కీర్తన 84:2 యెహోవా మందిర ఆవరణమును చూడవలెనని నాప్రాణము ఎంతోఆశపడుచున్నది" అనిదావీదు చెప్పుచున్నాడు. అపో. 2:42 సహవాసము కల్గి యుండాలి. సంఘ కార్యక్రమములలో పాల్గొనాలి.

**3. క్రమశిక్షణతోజీవించాలి:**

విచ్చలివిడిగా యున్నాను. 1కొరింథీ 9:25-26. పందెమందు పోరాడువాడు అన్ని విషయము లలోను మితముగా ఉండును. వారు క్షయమగు కిరీటమును పొందుటకు మనమైతే అక్షయకిరీటమును పొందు టకు మితముగా ఉన్నాము కాబట్టి గురిచూడని వానివలె పరుగెత్తు వాడను కాను. గాలిని కొట్టినట్లు నేను పోట్లాడుట లేదు గాని ఒకవేళ ఇతరు లకు బోధించిన తరువాత నేనే భ్రష్టుడనైపోదు నేమోయని నాశరీర మును నలుగకొట్టి దానిని లోపరచు కొనుచున్నాను.

**4. దేవుని ఆరాధించాలి:-**

యోహాను 4:23,24 "అయితే యాదార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది. "దేవుడు ఆత్మ గనుక ఆయనను

ఆరాధించువారు ఆత్మతోను సత్యము తోను ఆరాధించాలి".

**5. పరిశుద్ధముగా జీవించాలి :**

దేవుడు పరిశుద్ధుడు గనుక మీరును పరిశుద్ధులుగా యుండుడి.

1 థెస్స 4:4,5 "మీలో ప్రతీ వాడును దేవుని ఎరుగని అన్యజనులవలె కామాభిలాషయందు కాక, పరిశుద్ధత యందును, ఘనతయందును తన తన ఘటమును ఎట్లు కాపాడుకొనవలెనో ఎరిగియుండుటయే దేవుని చిత్తము".

1థెస్స 4:7 పరిశుద్ధులుగా యుండుటకే దేవుడు మనలను పిలిచెను గాని అపవిత్రులుగా ఉండుటకు పిలువ లేదు".

**6.సమర్పణ జీవితమును కల్గియుండాలి :**

రోమా 12:1,2 "కాబట్టి సహోదరులారా పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవయాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించు కొనుడని దేవుని వాత్సల్యతను బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది మీరు ఈలోక మర్యాదను అనుసరింపక ఉత్తమమును, అనుకూలమును, సంపూర్ణమునై యున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతన మగుట వలన రూపాంతరము పొందుడి.

**7. దేవునికి లోబడి యుండాలి:**

యాకోబు 4:7 కాబట్టి దేవునికి లోబడి యుండుడి అపవాదిని ఎదిరించుడి"

దేవునిపై తిరుగుబాటు చేయకూడదు, సణగకూడదు. దేవునికి లోబడి యుండాలి.

**8. దేవుని స్తుతించాలి :-**

1థెస్స 5:16 "ప్రతీవిషయములోను దేవునికి కృతజ్ఞతస్తుతులు చెల్లించుడి". కనుక మనమెల్లప్పుడును ఆత్మీయముగా పడిపోకుండునట్లు జాగ్రత్తగా చూచుకోవాలి వాక్యమును అనుసరించి మన జీవితములను సరిచేసు కోవాలి.

- B.S.A. సువార్త

## యేసు అతనిని 'పేతురు' అని రెండు మారులే పిలిచెను

## (Jesus called him Peter only Twice)

యేసు అంద్రెయ యొక్క సహోదరునికలసికొన్న దినమున "నీవు యోహాను కుమారుడవైన సీమోనువు, నీవు కేఫా అనబడుదువని" అతనితో చెప్పెను (యోహాను 1:42). పేతురు అను పదమును అరామిక్ భాషలో కేఫా అని యందురు. పేతురు, లేక కేఫా అనగా రాయి అని అర్థము. రాయి అనగా స్థిరత్వము, దృఢత్వమును సూచించు పదము. గాని అటుతరువాత ప్రభువు ఈ

శిష్యుని ఎప్పుడు పిలిచినా ఎల్లప్పుడు సీమోనేయనెను గాని అతని క్రొత్త పేరును బట్టికాదు.

సీమోను అనునది గ్రీకుపేరు. సుమెయోను దాని హెబ్రీ మూలము. అనగా ఆయన వినెను అని యర్థము (ఆదికా. 29:33). వినుట యనే భావము ఈ పేరులో ఇమిడి యున్నది. సువార్త రికార్డులలో అంద్రెయ యొక్క సహోదరుడు దుడుకు గలవాడును, తొందరపాటు గలవాడును, అపార్ధము చేసికొనుటలో ముందుండు వాడు నన్నట్లు చిత్రీకరించ బడుట ఆశ్చర్యము కాదు. అందు వలన ప్రభువు ఎప్పుడైన పేతురును—అతని కియ్యబడిన పేరుతో పిలిచియుంటే, ఆయన చెప్పేది జాగ్రత్తగ వినవలెనని దానిలోనే యున్నట్లు గమనించ గలము. పేరు మార్చబడినను యేసు మాత్రము రెండు సందర్భములలో తప్ప అతనిని సీమోననే పిలిచే వారు.

ప్రభువు పరిచర్య అరంభించిన రెండు సంవత్సరములకు ఆయనను గూర్చిన ప్రజాభిప్రాయము వేర్వేరుగ యున్నది. గాని సీమోను పేతురు "నీవు నజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" ఆయనను గూర్చిన సత్యము ఉద్ఘాటించెను (మత్తయి 16:16). అందుకు యేసు, సీమోను బర్ యోనా నీవుధన్యుడవు. పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచేనే కాని నరులు నీకు బయలుపరచలేదు. మరియు నీవు పేతురువు; ఈబండ మీదనా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాననెను" (మత్తయి 16: 17-18). గ్రీకులో పెట్రాస్‌కు, అరామిక్‌లో కేఫాకు చిన్నరాయి అని యర్థము మరియు సంఘము బండమీద అనగా పెట్రా మీద నిర్మింతునని ఆయన చెప్పెను. అది ఒక గంభీరమైన పునాది రాయి. పేతురు ఒక చిన్నరాయి గాని యేసు అయితే తన సంఘమునకు పునాది మరియు బండరాయి. దీనిలో యున్న నిశ్చలమైన సత్యము యేసుక్రీస్తు దేవుని కుమారుడై యున్నాడను గొప్ప వాస్తవమే. అందుకే "వేయబడినది తప్ప వేరొక పునాది ఎవడును వేయనేరడు, ఈ పునాది యేసు క్రీస్తే" అని వేరొక చోట చెప్పబడెను. (1 కొరింథీ 3:11).

యేసు పేతురు అను పదమును వినియోగించిన మరింకొక ఒకే ఒక్క సందర్భము ఆయన సిలువవేయబడక ముందు మేడగదిలో కనబడును. ఆయన శిష్యులు వారిలో ఎవడు గొప్ప వాడోయని తమలో తాము వాదించు కొనుచుండిరి (లూకా 22:24). ప్రభువు వారిలో ఒకని చూచి. "సీమోనూ, సీమోనూ" అని సంబోధిం

చెను (లూకా 22:31). ఇక్కడ ఆయన ఆపేరును రెండు మారులు రెట్టించుట గమనించుము. "నేను చెప్పేది జాగ్రత్తగ వినుము" అని యేసు యొక్క ఉద్దేశ్యమా? పేతురు యొక్క విశ్వాసము బలంగా పరీక్షింపబడబోవు సమయము వచ్చుచున్నదని యేసు ఎరుగును. గనుక ఆయన అతనిని బలపరచుటకు "నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీ కొరకు వేడుకొంటిని; నీ మనసు తిరిగిన తరువాత నీ సహోదరులను స్థిరపరచుమని చెప్పెను" (లూకా 22 :32).

యేసు చెప్పిన మాటలను పేతురు కడు జాగ్రత్తతో వినుట కంటె, ఉద్రేక పూరితుడై పేతురు, "ప్రభువా, నీతో కూడ చెరలోనికిని మరణమునకును వెళ్లుటకు సిద్ధముగా యున్నానని ఆయనతో అనెను" (22:33). అంతడెంత యదార్థ హృదయంతో ఆ మాటలు పలికినా, వాటిభావమును అతడు గ్రహించుకోలేదు. ఈ సమయంలో అతడు చెరసాలకుపోతే, మరణిస్తే విమోచన సంకల్పము ఎట్లు సాధ్య మగును? మచ్చలేని దేవుని గొర్రె పిల్ల శ్రమలనొంది మరణించవలని యుండెను గాని పేతురు కాదు (22:19-22). గాని సీమోను విషయములో దేవుని ప్రయోజనము వేరుగా యుండెను.

ఉద్రేకపూరితమైన పేతురు మాట లకు యేసు, "పేతురూ నీవునన్నెరుగనని ముమ్మారు చెప్పువరకు నేడు కోడి కూయదని నీతో చెప్పుచున్నాననెను" (22:34). అసందర్భముగా ప్రభువు ఇక్కడ పేతురు అని ఎందుకు సంభోధిం చారు? సీమోనూ, సీమోను అంటే ఇంకా బాగుండునేమో కదా? అయితే అప్పటికే ప్రభువు అట్లు ప్రయత్నించినా, ఫలితము లేక పోయింది. యేసు తన మాటలను జాగ్రత్తగా ఎంచుకొనువారును, అసంద ర్భంగా ఎన్నడు ఏపదమును వాడని వారును, ప్రతి పదమును ఒక కారణము చొప్పున వినియోగించు వారునై యున్నం దున, పేతురు అను పదమును వాడ కుండుటలో ఒక గొప్ప భావమున్నది. అసందర్భములో యేసు యొక్క ముఖ కళవళికలు ఎట్లుండెనో మనకు తెలియదు, ఆయన మాటలలో ఏమైనా అపహాస్య ముండెనో లేదో మనకు తెలియదు గాని, పేతురు తన సామకార్థనామ భావము చొప్పున జీవించవలసి యున్నదని అనగా తన సహోదరులను స్థిరపరచవలసినదని ఆయన యొక్క భావమై యుండెను. అయినను అప్పటికి ఆస్థితికి అతడింకా చేరుకోలేదు.

యోహాను 1:42లో యేసు నీవు సీమోనువు; కేఫా అనబడుదువని చెప్పిన మాటలు ప్రవచనాత్మకములు. అది

పేరుమార్పు కాదుగాని ప్రవచనము. సీమోనులో యున్న లోపములు, బలహీనతలనే గాక, సీమోను సయితము ఎరుగని గొప్ప శక్తిని యేసు అతనిలో చూచారు. బలహీనులైన మానవ మాత్రులతో యేసు అత్యంత ఓరిమితోను, ధైర్యముతోను పనిచేయుచు, తననోరు మూసుకొని చెవులతో వినుచు దృఢమైన వ్యక్తిగా అతడెదగాలని యేసు కాంక్షించారు. దానిని పేతురును సాధించారు.

భూమి మీద యేసు యొక్క పరిచర్యముగింపబడి, ఆ పని తన శిష్యులకు అప్పగింపబడిన తరువాత, పేతురు అను పదమువాడకుండ అపోస్తలుడైన సుమెయోనును గూర్చి అపొ.కా. 15:14 లో మాత్రము చెప్పబడెను. ఇక్కడ యాకోబు అతనిని సుమెయోను అని అతనిగూర్చి చెప్పాడు. అతని పేరులో యున్న వినుట యను భావము ఇప్పుడు అతనికిగాక, అతనిని వినుచున్నవారివైపు ఇప్పుడు మళ్లించబడుచున్నది. అతడిప్పుడుస్థిరమైన, బలమైన దేవుని సేవకుడు. యితరులు అతని మాటలను లక్ష్యపెట్టవలెను (అపొ.కా. 2:14,22).

మనము నేర్చుకొన దగిన పాఠం యేమైనా ఇక్కడ యున్నదా? ప్రభువు కొరకు నేను నా సంపూర్ణశక్తి సామర్థ్యములను వినియోగించుచున్నావా? ఆయన చిత్తమును జరిగించుట కొరకు నేను ఎంతమట్టుకు సిద్ధపడియున్నానో దానిపై యిది ఆధారపడి యుంటాది. ఇంకొక మాటలో దేవుని వాక్యమును వినుటకు, నేర్చుకొనుటకు, ఎదుగుటకు నేను నిజముగా ప్రయత్నించుచున్నానా? నేనింకా అక్కడ లేక పోయినను, ప్రభువు నాలో చూచు శక్తిని ఆయన కొరకు వినియోగించ ప్రయత్నించుచున్నానా? అంతేకాదు ఒకరిలో యున్న శక్తిని మరొకరం చూడగలుగు చున్నామా? ఒకరి యెడల ఇంకొకరం ఓరిమి కలిగి యున్నామా? విశ్వాసముతో పనిచేయు చున్నామా! పేతురే ఇట్లు చెప్పు చున్నాడు. "మనుష్యులచేత విసర్జింపబడినను, దేవుని దృష్టికి ఏర్పరచబడినదియు అమూల్యమును సజీవమునైన రాయియగు ప్రభువు నొద్దకు వచ్చిన వారై యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులు అర్పించుటకై పరిశుద్ధ యాజకులుగా యుండునట్లు మీరును సజీవమైన రాళ్లవలెనుండి ఆత్మసంబంధ మైన మందిరముగా కట్టబడుచున్నారు'' (1పేతురు 2:4-5).

నీవు వినుచున్నావా ?

- కెవిన్ మూర్

మరునాడు అమెరికా బృందము రిక్కీగారు బొల్లారాం గ్రామములో సువార్తచాటిరి. అక్కడ చాలకాలముగా సోదరులు జంగిలి రాములు (యోనా) గారు నమ్మకముగా సువార్తచాటుచున్నారు. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. తదుపరి కరీంనగర్‌లో యున్న సోదరులు గొట్టిముక్కల అబ్రాహాంగారు వారి కుమారులతో కలిసి నర్సింగిలో ఏర్పాటు చేసిన మంచి కూటములో సోదరులు వాక్యపరిచర్యచేసిరి. కరీంనగర్‌లోను, పరిసరప్రాంతములలోను సోదరులు గొట్టిముక్కల అబ్రాహాంగారు వారికుమారులు పౌలు. ఐజక్, నోవా గార్లు నమ్మకముగా క్రీస్తుసువార్త చాటుచున్నారు.

2015 ఫిబ్రవరి 13వ తేదీ శుక్రవారం కరీంనగర్ జిల్లా ధర్మారాంలో సువార్త కూటము జరిగెను. అక్కడ సుంచు దేవిడ్ గారు నమ్మకముగా సత్యసువార్తను చాటుచున్నారు. అమెరికా సువార్తికుల బృందము, రిక్కీగారు అక్కడకు చేరుకొనుటకు ఆలస్యమైనను మంచి సువార్తకూటము జరిగెను. కూటము అనంతరం 11 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వచ్చినవారందరకీ స్థానిక సంఘము మంచి భోజనము నేర్పాటు చేసిరి.

2015 ఫిబ్రవరి 14వ తేదీ శుక్రవారం కరీంనగర్ జిల్లా గుండిలో మంచి సువార్త కూటము జరిగెను. అమెరికా సోదర బృందము రిక్కీగారు ఆ గ్రామమునకు చేరుకొని అక్కడి సంఘమును దర్శించి వాక్యపరిచర్యచేసిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. గుండిలో సోదరులు మచ్చా దేవిడ్ గారు పలు సంవత్సరములుగా క్రీస్తు సువార్త చాటుచున్నారు. గత సెప్టెంబరు నెలలో జాషువాగారు సతీ సమేతముగా గుండి దర్శించినప్పుడు 7గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కరీంనగర్ జిల్లా పర్యటన అంతటిలోను సోదరులు మచ్చాదేవిడ్ గారు రిక్కీగారితో యుండి పలువిధాలుగా సహాయము చేసిరి.

2015 ఫిబ్రవరి 15,16 తేదీలలో పై బృందము మణుగూరు చేరుకొని అక్కడ రెండు రోజులు బైబిలుక్లాసులు నిర్వహించిరి. సోదరులు పి. సురేంద్రకుమార్‌గారి నిర్విరామకృషివలన అనేకులు హాజరై దేవుని వాక్యమును నేర్చుకొనిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

2015 ఫిబ్రవరి 17వ తేదీ మంగళవారం వరంగల్లు పట్టణంలో ఒక్కరోజు బైబిలు క్లాసులో పైనుదహరించిన అమెరికా సువార్త బృందము రిక్కీ గూటం గారు

వాక్య పరిచర్య చేసిరి. సోదరులు గౌరైప్రసాద్‌గారి కృషివలన సమస్తము సక్రమముగా జరిగెను. 4గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. గౌరైప్రసాద్‌గారు పలు సంవత్సరములుగా వరంగల్లులో సువార్త చాటుచున్నారు. 17వ తేదీ రాత్రి అమెరికా బృందము అమెరికాకును రిక్కీగారు కాకినాడకును వరంగల్లు నుండియే బయలుదేరి తమ తమ పట్టణములకు క్షేమముగా చేరుకొనిరి.

సత్యవాణి ద్వారా లభించుచున్న ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో వేల కొలది ప్రజలు చేరి బైబిలును అధ్యయనము చేయుచున్నారు. ఆకోర్సుపూర్తి కాగానే బైబిలు గ్రంధమును ఉచితముగా పొందుచున్నారు. మీరు, మీ కుటుంబ సభ్యులు, సంఘ సభ్యులు ఆ కోర్సులో చేరి బైబిలును మీ యింటివద్దనే నేర్చుకొనండి. ఈనాడే మాకు వ్రాయండి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004